## కొహెడ మండలానికి యూరియా కొరత తీర్చండి



**ప్రజాపక్షం/కొహెడ:** కొహెడ మండలానికి సరిపడే యూరియా ఇచ్చి రైతులకు యూరియా కష్టాలు తీర్చాలని కొహెడ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజు బుధవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి , మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్ర రవీందర్, కాన్సిటెన్సీ యూత్ అధ్యక్షులు శివారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేపూరి శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ కొంపెల్లి శశిధర్, స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 21 ఆగస్టు, 2025 | పేజీలు : 08


# కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

### అధికార యంత్రాంగం, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాళేశ్వరంలో బుధవారం గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సిడబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ,పోలీస్,పంచాయతీ రాజ్, విద్యుత్,ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరి పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్డీడిఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పలు సూచనలు చేశారు. వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నది తీర ప్రాంతాలకు వెళ్లరాదని,వరద నీటిలో వాహన ప్రయాణాలు చేయరాదన్నారు. పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా ఉంచాలని, అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు ప్రజలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ, అత్యవసర సేవలకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. ఏదేని అత్యవసర పరిస్థితిలో పోలీస్ కంట్రోల్ రూము 100 కు కాల్ చేయాలని సూచించారు. ప్రజలు తీర ప్రాంత పరిసరాల్లోకి వెళ్లకుండా పోలీస్ పటిష్ట నియంత్రణ చేపట్టాలని సూచించారు. ఎగువలోని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో వరద ఉధృతి భారీగా పెరుగుతున్న దృష్ట్యా ఎప్పటికప్పుడు వరద సమాచారం ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు. అనంతరం అన్నారం వెళ్ళే రహదారిలో చంద్రుపల్లి వాగు కాజ్ వే పై వరద నీరు చేరిన ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. వాగులో పూర్తిగా నీరు తగ్గే వరకు ప్రజల రాకపోకలు నిలిపివేసి ప్రయాణాలు చేయకుండా ఇరువైపులా భారీ కేడింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి,కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కీర్తి నగర్ పిహెచ్‌సి

# ఆకస్మికంగా తనిఖీ



కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్ :** గీసుకొండ మండలం కీర్తి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలోని రక్త పరీక్షల గది, మందులు అందజేసే గది, ఇన్ పేషెంట్ వార్డ్, బెడ్స్, టాయిలెట్స్, వాక్సినేషన్ ను పరిశీలించారు. ప్రతిరోజూ హాస్పిటల్ కు ఎంత మంది రోగులు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల స్టోర్ రూమ్ లో స్టాక్ వివరాలను తనిఖీ చేసి మందుల గడువు తేదీలను పరిశీలించారు. పారాసెటమాల్ మందు అధికంగా ఉండడం పై ఫార్మసీ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అవసరం మేరకే మందుల ఇండెంట్ తెప్పియాలన్నారు. ప్రతి మందు ఈ ఔషధం ప్రకారమే రోగులకు అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి మరింతగా పరిశుభ్రంగా ఉంచాలని, స్క్రాప్ ను వెంటనే తొలగించుటకు చేయుటకు చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. హాస్పిటల్ కు వచ్చే రోగులకు సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, మెడికల్ ఆఫీసర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

### రసాయన ఎరువులకు దీటుగా

# నానో యూరియా అధిక ప్రయోజనం

**ప్రజాపక్ష/జనగామ :** రసాయన ఎరువులకు ధీటుగా నానో యూరియాతో అధిక ప్రయోజనం పొందవచ్చునని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. నానోతో పర్యావరణ పరిరక్షణ, పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. కొరమండల్ ఇంటర్నేషియల్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులకు నానో టెక్నాలజీపై అవగామ సదస్సు జరిగింది. ఈ కార్యకమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంప్రదాయ యూరియా వాడడం వలన పర్యావరణ కాలుష్యం, భూగర్భ జల వనరులకు ఇబ్బంది కలగడమే కాకుండా భూమిలోని పోషకాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. నానో యూరియా అనేది నానో టెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిందని, ద్రవ రూపంలో ఉండే ఎరువు కావడం వలన అధిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా అతి తక్కువ మొత్తంలో వాడడం వల్ల మట్టి నీటి, కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. అధిక దిగుబడులతో పాటు మొరుగైన పోషక విలువలతో కూడిన పంటలను పండించడానికి నాలో యూరియా సహాయ పడుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులు నానో యూరియా వాడకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, ఏడిఎలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



**లింగాలఘనపురంలో కలెక్టర్ అకస్మిక తనిఖీ**

జనగామ మండలంలోని లింగాలఘనపురంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక అకస్మికంగా తనిఖీ చేశారు. నెల్లుట్ల, లింగాలఘనపురం మండలాల్లో ని ఆగ్రోస్, ఫర్టిలైజర్ కేంద్రాలను తనిఖీ చేశారు. రద్దీ కాకుండా ఉదయాన్నే షాపులు తెరవాలని, రైతులను ఇబ్బంది పెట్టకుండా యూరియా ఇవ్వాలన్నారు. జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు అధైర్య పడకుండా యూరియా అవసరమైన మేరకు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/జనగామ :** దేశ అభ్యున్నతియే లక్ష్యంగా మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ పనిచేశారని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. బుధవారం జనగామలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే రాజీవ్ గాంధీ భారత ప్రధానమంత్రి అయ్యారన్నారు. దేశ భవిష్యత్తు యువకుల చేతుల్లోనే ఉందని ఓటు హక్కును 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకే మార్చారని, నేడు 18 ఏండ్ల వయసున్న వారందరికి ఓటు హక్కు వచ్చిందంటే అది కేవలం రాజీవ్‌గాంధీ చొరవ అన్నారు. ఐటి రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, వ్యవసాయం, విద్య రంగాల్లోనే అనేక సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అన్నారు. ఆయన ఆశయాల సాధనగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గంగం నరసింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు, చెంచారపు బుచ్చిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికే ఇందిర, పిఎసిఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, బక్క శ్రీనివాస్, బడికే కిష్టస్వామి, తుపాకుల రాములు, దుర్గేష్, బానోతు బన్సి నాయక్, మాజీ కౌన్సిలర్ గాదెపాక రాంచందర్, వంగాల కళ్యాణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకాష్ యాదవ్, మచ్చ ప్రవీన్, మిద్దెపాక స్టాలిన్, ఉల్లెంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## రైతులకు సరిపడా యూరియా అందించడంతో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** రైతులకు సరిపడా యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌నగర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది.

ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియాను అందించాలని లేదంటే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి సభ్యులు రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, అశోక్, సమ్మయ్య, కనకచారి, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** సెప్టెంబర్ 01, 2004 తర్వాత అమలు పరుస్తున్న, ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలుపరచాలని సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పీఆర్టీయూ టీఎస్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నా పోస్టర్‌ను మండల కేంద్రంలో గల విద్యావనరుల కేంద్రం ఆవరణలో మండల విద్యాశాఖాధికారి గుంటిపల్లి కళావతి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్షులు అంబటి అంజయ్య మాట్లాడుతూ లోపభూయిష్టమైన, అసంబద్ధమైన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని సెప్టెంబర్ 1న సంఘం ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నాను ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, రాష్ట్ర బాధ్యులు లక్ష్మణ్ రావు, శ్రీనివాస్, మదన్మోహన్‌రెడ్డి, శోభారాణి, రాజు, అశోక్, వెంకన్న, పద్మావతి, రామన్న, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి:** యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసకావొద్దని ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎల్కతుర్తిలోని మోడల్ స్కూల్‌లో బుధవారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీసు కళా బృందం విద్యార్థులకు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడొద్దని, చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షి టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, తల్లితండ్రులు చెప్పిన మాటాలు వినాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లు, సిబ్బంది, కళా బృందం ఇన్‌ఛార్జి ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పోలీస్ కానిస్టేబుల్ పూలసింగ్, హోంగార్డులు నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## డాక్టర్ సంపత్ రాజారాం యాదవ్ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్ అధ్యక్షతన ఆరెపల్లి సంపత్ రాజారాం యాదవ్ 13వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీసీ ప్రతినిధి, మాజీ కుడా ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ హాజరై మాట్లాడుతూ.. డాక్టర్ ధర్మపురి సంపత్ రాజారాం యాదవ్‌ను స్మరించుకుంటూ ఆయన అమూల్యమైన సేవలను కొనియాడారు. ఆయన జీవితాంతం బీసీల హక్కుల కోసం పోరాడారన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతే తన కర్తవ్యమని ఎల్లప్పుడు ఉద్యమ పంథాలో ముందుండి నడిచిన సాహసవంతుడు.ఆయన ఆత్మ సమర్పణ, త్యాగం, సేవా స్ఫూర్తి తరతరాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. సమాజం కోసం చేసిన ఆయన యత్నాలు ఎప్పటికీ మర్చిపోలేనివన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జన్ను అనిల్, డాక్టర్ విజయలక్ష్మి, ఏసీపీ రవీందర్‌కుమార్, గడ్డం భాస్కర్, డాక్టర్ కూరపాటి రమేశ్, వరంగల్ యాదవ సంఘం అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, జనగామ జిల్లా అధ్యక్షుడు బనక సంపత్ యాదవ్, కార్పొరేటర్ జక్కుల రవీందర్, కావటి కవిత, కంకణాల మల్లేశం,, బగ్గీ రాజు ముదిరాజ్, బొల్లం వెంకటేశ్వర్లు, గాలి సుధాకర్ పాల్గొన్నారు.



## బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్‌గా వంశీధర్ రావు

**ప్రజాపక్షం/కమలాపూర్:** రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సామాజిక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన వంశీధర్ రావుని నియమిస్తూ తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము, రాష్ట్ర ఛైర్మన్ జగన్ మోహన్ శర్మ ప్రకటించారు. ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి రాము, రాష్ట్ర ఛైర్మన్ జగన్ మోహన్ శర్మ, యువజన రాష్ట్ర అధ్యక్షులు దండిబోట్ల రామాంజన్ కుమార్ శర్మకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు ఉదయమర్రి కృష్ణమూర్తి, బ్రాహ్మణ పెద్దలు దర్శనం మాసపత్రిక సంపాదకులు మారుమాముల వెంకటరమణ శర్మ, అర్చక జేపిసి అధ్యక్షులు గంగు ఉపేందర్ శర్మ, ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకర్, కోశాధికారి విజయ సారధి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దండాపతుల గోపీనాథ్ శర్మ, టిఆబిఎస్ఎస్ ప్రణాళిక కమిటి ఛైర్మన్ నమిలికొండ కిరణ్, యువజన అధ్యక్షులు దండిబొట్ల రామాంజన్ కుమార్ శర్మ, నాయకులు శ్రీనివాస్ శర్మ, దేవులపల్లి హరిహరన్, మోత్కూరి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.




## చక్రధర్‌రావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** భీమారం ప్రాంతానికి చెందిన ఎర్రబెల్లి చక్రధర్‌రావు దశదిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలంలోని గూడూరు పల్లె దవాఖానా పరిధి నేరెళ్ళ గ్రామంలో వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓపి 59 మంది చూసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనుమానిత జ్వర పీడితులకు ఆర్‌డిటి, బిఎస్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్ మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణా రెడ్డి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు మొదలైన వారు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఈనెల 22న జరుగబోయే ఫీజు దీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ అన్నారు.

మండల ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశం మండల కార్యదర్శి దండుగల మురళి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సుమ హాజరై మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. స్కాలర్‌షిప్స్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజ్ రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేదంటే ఎక్కడికి అక్కడ ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఖిల్, రాకేష్, నిఖిల్, కమల్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## కాలువల మరమ్మతుకు నిధులు మంజూరు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని బండనాగారం గ్రామం నుండి దేవాదుల కాలువ పైప్ లైన్ మరమ్మత్తుకు నిధులు మంజూరు అయినట్లు ఇరిగేషన్ ఈఈ మంగీలాల్ తెలిపారు. అందులో భాగంగా బండనాగారం గ్రామం కాలువ నుంచి కొడవటూర్ గ్రామంలోని ఊర చెరువులోకి గోదావరి జలాలు తరలించేందుకు గాను కాల్వ మరమ్మత్తు కోసం ప్రభుత్వం రూ.10.35లక్షలు మంజూరు చేయించిందన్నారు. కాల్వ పనులు పూర్తయితే ఊర చెరువులోకి గోదావరి జలాలు సులభంగా వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రావణ్, ఏఈ వెంకన్న, గంగం సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, శేఖర్‌రెడ్డి, కరుణాకర్, నర్సిరెడ్డి, పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నల్ల శ్రీరామ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సురేష్ బాబు, మండల యూత్ అధ్యక్షుడు వెంకన్న, నాయకులు సజ్జన్, నాగరాజు, గణేష్, ఉమేష్, యాకస్వామి, రవి, రమేష్, రాంచందర్ నాయక్, రాజేందర్ నాయక్, అంజయ్య, రతన్, శ్రీనివాస్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## శాంతి వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** గణేష్ నవరాత్రి ఉత్స వాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతివాతా వరణంలో జరుపుకోవాలని జనగామ డీసీపీ బి రాజమహేంద్ర నాయక్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పకుండా తీసుకోవాల న్నారు.భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.డీజే లకు మండపాలలో అనుమతి లేదని, తక్కువ శబ్దంతో స్పీకర్లను వాడుకోవాలని, రాత్రి 10 తర్వాత వాటి వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. ఎలాంటి నిషేధిత కార్యక్రమాలను నిర్వహించవద్ద న్నారు. మండపాలలో అప్రమత్తత అవసరమ న్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100కు లేదా స్థానిక పోలీసులకు సమా చారం అందించాలన్నారు. గణేష్ నవరాత్రి ఉత్స వాలు శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో సాగేందుకు నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటించాల న్నారు. వినాయకుని ఆశీస్సులతో ఈ పండుగ అందరికీ శుభం జరుగాలని డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆకాంక్షించారు.

## మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొండపల్లి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కొండపల్లి కుమారస్వా మిని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం చెప్పారు. ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ జిల్లా, మండల మున్నూరు కాపు సంఘం బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా నాయకులకు ప్రత్యే కంగా కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థికి అండగా నిలిచిన పలువురు దాతలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని కొండా పురం గ్రామానికి చెందిన భూక్య వంశీ ఉన్నత చదు వుల కోసం ఢిల్లీ యూనివర్సిటీలో అడ్మిషన్ రావ డంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకునే పరిస్థితి భారంగా మారింది. చదువులకు సహాయం అందిం చాలని విద్యార్థి కుటుంబం కోరడంతో సహృద యంతో పలువురు దాతలు స్పందించి వంశీ చదు వుల కోసం సహాయం అందజేశారు. 10వ తరగతి క్లాస్‌మేటల్స్ రూ.22వేల ఆర్థిక సహాయం అందజే శారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో హరిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ సంజయ్, యశోద హాస్పిటల్ అధినేత మహేందర్, డాక్టర్ కోటేష్, సంతోష్, హరీష్, వెంకన్నలు ఉన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం పేదలకు చేయూతనిస్తామన్నారు.

## గూడూరులో కరెంటు కోతలు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :**జిల్లా గూడూరు మండల కేంద్రంలో నిత్యం కరెంటు కోతలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి రోజురోజుకి కరెంటు కోతలు ఎక్కువ అవుతుండటంతో పనులు చేసుకోలే కపోతున్నామని చిరు వ్యాపారులు చిన్న తరహా పరి శ్రమల యజమానులు ఆవేదన వ్యక్తిం చేస్తున్నారు. అంతేకాకుండా కరెంటు కోసం ఒకవేళ ఫోన్ చేస్తే కట్ చేస్తున్నారని వినియోగదారులు ఆ రోపిస్తు న్నారు. కరెంటు డిపార్టెంట్ సిబ్బంది ప్రతి రోజు హోటల్ దగ్గరికి వచ్చి చూస్తున్నప్పటికి ట్రాన్స్ఫా ర్మర్ వద్ద పరిస్థితిని పట్టించుకోవడంలేదని పలు వురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి వెంటనే మండల కేం ద్రంలో విద్యుత్ కోతలను నివారించాలని కోరుతున్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియా డారు. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కేకు కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూపాలపల్లి భారతదేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లిన దూరదృష్టి కలిగిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని, ప్రపంచదేశాల్లో దేశాన్ని బలమైన దేశంగా చేయడానికి రాజీవ్ చేసిన కృషి, సేవలు మరువలేనివని అన్నారు. యువతకు శక్తి ఇచ్చిన నాయకుడిగా రాజీవ్ గాంధీ ఎప్పటికీ అందరికీ గుర్తుండిపోతారన్నారు. రాజీవ్ గాంధీ టెలీకమ్యూనికే షన్, రక్షణ, వాణిజ్య, విమానయాన సంస్కరణలు ప్రవే శపెట్టారని అన్నారు. విద్యావకాశాల సమానత్వం కోసం నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ ను తీసుకొచ్చి నట్టు గుర్తుచేశారు. 61వ రాజ్యాంగ సవరణతో ఓటేసేం దుకు కనీస వయసు 21 నుండి 18 ఏళ్లకు తగ్గించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని ఎమ్మెల్యే అన్నారు. 91 పార్లమెంట్ ఎన్నికల్లో 40 శాతం టికెట్లను యువతకు కేటాయించి తాను మాటలకారి కాదని, చేతల్లో చూపి స్తానని రాజీవ్ గాంధీ నిరూపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజ బాబు, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పిప్పాల రాజేందర్, బుర్ర కొమ రయ్య, అప్పం కిషన్, అంబాల శ్రీనివాస్, సాంబ మూర్తి, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజల రవీందర్, చల్ల రేణుక, పలువురు కాంగ్రెస్ నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా 'లయన్స్ క్లబ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** నిరుపేదలకు అండగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ అధ్యక్షులు డాక్టర్ బి. వీరన్న తెలిపారు. క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ డాక్టర్ వెనిగెళ్ల జగన్ మోహన్ రావు, లావణ్య దంప తుల పెళ్లి రోజు సందర్భంగా బుధవారం మానుకోట పట్టణంలో చెప్పులు కుట్టుకుని ఎండా, వానల్లో ఇబ్బంది పడుతున్న వృత్తిదారులకు గొడుగులు పంపిణీ చేశారు . ఇందిరాగాంధీ, నెహ్రూ, శ్రీనివాస థియేటర్ సెంటర్లలో చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తున్న వారికి ఈ గొడుగులను అందజేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. సమా జంలో అన్ని వర్గాలకు చెందిన వారికి సేవలు అందేలా తమ క్లబ్ విస్తృతమైన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. సీనియర్ వైద్యులుగా గుర్తింపు పొందిన డాక్టర్ జగన్ మోహన్ రావు గారు తమ పెళ్లి రోజు సంద ర్భంగా తనవంతు సాయం అందిస్తు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. తమ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ పరకాల రవీందర్ రెడ్డి, కోశాధికారి కొండపల్లి కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్, మైక్రో క్యాబినెట్ సభ్యులు అను మాల వెంకటేశ్వర్లు, క్లబ్ బాధ్యులు డాక్టర్ వెనిగెళ్ల జగన్ మోహన్ రావు, పమ్మి సనాతన చారి, సాదుల సురేష్ బాబు, మాలె కాశీనాథ్, శ్రీరంగం నవీన్, అను మాల సిద్దార్థ, సీఐటీయు జిల్లా నాయకులు ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## 22న పనుల జాతర కార్యక్రమాలు

**ప్రజాపక్షం /జనగామ** : పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం, స్వచ్ఛ భారత్ మిషనర్, గ్రామీణ పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టబోయే పనులు ఈ నెల 22 పనుల జాతరలో భాగంగా ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. కొత్త పనులలో ప్రధా నంగా పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, కోళ్ల ఫామ్ షెడ్లు, పొలం బాటలు, గ్రామ పంచాయితీ, అంగన్ వాడీ , ప్లాస్టిక్ వేస్ మేనేజ్మెంట్ యూనిట్లు, సెగ్రిగేషన్ షెడ్లు, గ్రామీణ రహదారులు పనులు ప్రారంభించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు పార్లమెంట్ సభ్యులు పాల్గొం టారన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయా లని ఆయా శాఖల అధికారులు ఆదేశించారు.

## నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/తొర్రూరు:** నిరుపేదల సంక్షే మమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న కొత్త రేషన్ కార్డులను బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డిల ఆదేశాల మేరకు పట్టణంలోని రేషన్ షాపులో నూతన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేదల కష్టా లను తెలుసుకొని రేషన్ కార్డులను అందించారని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, గంజి విజయపాల్‌రెడ్డి, గుండాల నర్సయ్య, జలకం శ్రీనివాస్, వెంకటాచారి, తాళ్లపెల్లి బిక్షంగౌడ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, కుషాల్, రాజేశ్‌యాదవ్, మనోహర్, సురేశ్, మహేశ్వరి, కల్పన, జలీల్, రామచంద్రయ్య, వెంకన్న, మహేశ్ యాదవ్, యశోద, దేవేందర్, రేషన్ షాపు డీలర్లు సోమిరెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, వార్డు ఆఫీసర్లు మురళి, అజయ్, నరేశ్, సురేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## లింగాలఘనపురం వడిచెర్ల వద్ద రోడ్డు ప్రమాదం

**ప్రజాపక్షం /జనగామ :** జనగామ జిల్లా లింగాలఘనపురం మండ లంలోని వడిచర్ల వద్ద జనగామసూర్యపేట రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు జిల్లాకు చెందిన దద్దోలు సురేష్ ఆయన భార్య దివ్వ అక్కడికి అక్కడు మృతి చెందారు. పిల్లలు మోక్షజ్ఞ, లోక్షణ ప్రాణాలతో బయపడ్డారు. వీరు నెల్లూరి నుండి కరీం గనర్ వెళ్తున్నట్లుగా సమాచారం. కరీంగర్‌లో మృతుడు దద్దోలు సురేష్ గ్రానైట్ కంపెనీలో మార్కర్‌గా పనిచేస్తుండగా నిద్రమత్తు వలనే డివైడర్‌గా ఢీకొట్టగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## గణేష్ మంటపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరి

**ప్రజాపక్షం /జనగామ :** గణేష్ మండపాల కోసం ముందస్తు అను మతి తప్పనిసరి అని వెస్ జోన్ డిసిపి రాజమహేంద్రనాయక్ అన్నారు. బుధవారం వారొక ప్రకటన చేస్తూ వెస్ట్ జోన్ పరిధిలో గణేష్ నవరాత్రుల సందడి మొదలైందన్నారు. వినాయక మండలాల వద్ద ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూస్తామని, బందోబస్తు, ఏర్పాట్ల రీత్యా మండపాల నిర్వాహణకు ముందస్తు అనుమతి తీసుకో వాలన్నారు. పోలీస్ శాఖ నిర్వయిస్తున్న వెబ్‌సైట్‌లో ప్రతిమ ఎత్తు, మండపం స్థలం, నిమజ్జనం తేదీ తదితర వివరాలు నమోదు చేసి రిజి స్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖ ఆన్‌లైన్‌లోనే అనుమతులు ఇస్తుందన్నారు.

## దేశానికి రాజీవ్ చేసిన సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ భారత దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డిలు అన్నారు. మండల కేంద్రం లోని రాజీవ్ చౌరస్తాలో భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డిలు రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలు రాజీవ్ చూపిన దారిలో నడుస్తూ ప్రజలకు సేవలో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారు జోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు రాజీవ్ గాంధీ భారత ప్రధానిగా ఉన్న హయాంలో దేశంలో జరిగిన విప్లవా త్మక మార్పులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ టీసీ బొల్లం అజయ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మహేందర్‌రెడ్డి, నరేందర్, వెంక్‌రెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరక్టర్ బాషు మియా, మండల నాయకులు బుచ్చయ్య, పాషా, రవి కురుమ, చిన్న నాగేష్, కాంగ్రెస్ గ్రామ పార్టి అధ్యక్షులు రవి, నాయకులు లక్ష్మా రెడ్డి, నరేష్, మల్లేష్, ఆంజనేయులు, కుమార్, పాల్గొన్నారు.

## సిఐ చోరవతో రాకపోకలకు లైన్ క్లియర్

**ప్రజాపక్షం/గూడూరు:** గత కొన్ని రోజులుగా ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్తున్న బస్సులకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారిన గుంతలో గూడూరు సీఐ సూర్యప్రకాష్ చొరవతో మట్టి పోయడం జరి గింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఎన్ హెచ్ 365 జాతీయ రహదారి నుండి బస్టాండ్ లోకి వెళ్లేదారిలో భారీ గుంత ఏర్పడి బస్సులు లోపటికి వెళ్తూ తిరిగి వస్తున్నప్పుడు తీవ్ర ఇబ్బంది ఎదుర్కోంటుండగా ఈవిషయాన్ని స్థానికులు గూడూరు సీఐ సూర్యప్రకాష్ కు తెలపగా ఆయన నేషనల్ హైవే అథారిటీ అధికారు లతో మాట్లాడి సదర్ కాంట్రాక్టర్ తో ఆగుంతలో వట్టి పోయించి చదును చేయడం జరిగింది.దీంతో రాకపోకలకు లైన్‌క్లియర్ అయింది సీఐ సూర్యప్రకాష్ చోరతో ప్రయాణిలకు ఇబ్బందులు తొలగిపోయాయని పలువులు ఆయనను ప్రశంసించారు.

## రిజిస్ట్రేషన్ ద్వారా వినియోగదారులకు ఇసుక

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌తో వినియోగదారులకు ఇసుక మరింత చేరువ అయిందని తహసీల్దార్ అనీల్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇసుకను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకోచ్చిందని తెలిపారు.ట్రాక్టర్ డ్రైవర్లు ఇసుక ట్యాక్సీయాప్ నందు రిజిస్ట్రేషన్ చేసుకుని అవసరమైన పత్రాలతో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక రవాణా చేయాలని తెలిపారు.పూర్తి వివరాల కోసం పలిమెల,మహాదేవపూర్ తహసీల్దార్ కార్యాలయాలలో సంప్రదించాలని తెలిపారు.

## రైతుల కోసం రోడ్డెక్కిన నిరసన తెలిపిన మాజీ ఎంఎల్‌ఏ పెద్ది

**ప్రజాపక్షం/ఖానాపూర్:** మండలంలోని బుధరావుపేట గ్రామంలో రైతన్నల కోసం నర్సంపేట మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్ రెడ్డి రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఉదయం 3 గంటల నుండి లైన్‌లో నిలబడిన రైతులకు యూరియా దొరకపోవడంతో ఆగ్రహం చెందిన రైతన్నలు 365 జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా కొరత తీవ్రంగా ఉందన్నారు. సరిదిద్దాల్సిన అధికారులు ప్రజా ప్రతినిధులు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా పంటల సాగుకు అవసరమైన యూరియా దొరక్కపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారని, పొద్దున నుండి నిలబడిన రైతులకు యూరియా అందకపోవడంతో లైన్‌లో నిల్చిన రైతుకు మూర్ఛ వచ్చి సొమ్మసిల్లి పడిపోయాడన్నారు. రైతన్నలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం మండల సొసైటీ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్ రావు, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు బాదావత్ బాలకృష్ణ, రమేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు పట్టణం నందు మంగళవారం నుండి తీజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తీజ్ ఉత్సవాలు తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవమైన మేరమ్మ తల్లికి, సేవాలాల్ మహారాజ్‌కు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మహిళలు, యువతులు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ తమ భక్తి శ్రద్ధలను చాటుకుంటారు. లంబాడి సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే పండగలో అతి ముఖ్యమైందని తీజ్ పండగ, తీజ్ అనగా గోధుమ మొలకలు అని అర్థం. ఈ పండగను యువతులు వారి మనసులో కోరికలు కోరుకోవడం కోరికలు నెరవేరుతాయని పెళ్ళి కానీ అమ్మాయి శ్రావణమాసంలో తొమ్మిది రోజులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో పండగ జరుపుకుంటారు. పశుసంపద, పాడిపంటలు ప్రజలందరూ బాగుండాలని దేవతలను కోరుతూ సంపూర్ణమైన ఆరోగ్యం ప్రసాదించాలని అడపడుచులు దేవుళ్ళను వేడుకుంటారు. తొమ్మిది రోజులు జరిపే ఘట్టాలలో మొదటి ఘట్టం సీత్లా భవానికి పూజా కార్యక్రమం మంగళవారం గట్టమ్మ వద్ద పూజలు నిర్వహించారు. బుధవారం బుట్లు కట్టుటను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు పోరిక గోవింద్ నాయక్, పోరిక సర్వన్ కుమార్, అజ్మీర సమ్ములు, జరుపుల బాలు నాయక్, సభావత్ మోతీలాల్, బానోత్ దేవ్ సింగ్, భూక్య సోమానాయక్, హట్కర్ సమ్మయ్య, పోరిక భగవాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యూరియా సరఫరాపై రైతు లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయం నుండి వ్యవసాయ, సహకార, సహకార సంఘాల సీఈఓలు, మార్క్ ఫడ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంటలకు అవసరమైన యూరియా రైతులకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసుల పంటలు ఒకేసారి సాగు చేయడం వల్ల యూరియా వినియోగం పెరిగినట్లు తెలిపారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించి రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రైవేటు డీలర్లు యూరియా కొనుగోలుకు ఇతర యూరియా తీసుకోవాలని లింకు పెట్టొద్దని పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రతి రోజు ఎరువుల స్టాకు వివరాలు ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, అవసరాన్ని బట్టి నిల్వలున్న చోట నుండి తీసుకుని కొరత రాకుండా చూడాలని తెలిపారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యత వివరాలను అధికారులు, టాస్క్ టీములు ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో యూరియా కోసం అనవసరంగా రైతులు లైన్ లో నిలబడకుండా ఎప్పుడు సరఫరా చేస్తామనే అంశం స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, సహకార అధికారి వాలియానాయక్, మార్క్ ఫడ్ డిఎం, సహకార సంఘాల సీఈఓలు, వ్యవసాయ శాఖ ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనకు ప్రజా ప్రభు త్వంలో పెద్దపీట




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ కు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్, కళాశాల సిబ్బంది, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఏటీసీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం భూపాలపల్లిలో సుమారు రూ.42.64 కోట్లతో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏటీసీలో రెండేళ్ల కాల పరిమితి కలిగిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ అయిన భూపాలపల్లి నియోజకవర్గ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియాగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఏడాది కోర్సులల్లో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, పార్టిషన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా, రెండేళ్ల కాలపరిమితితో ఉన్న కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, అడ్వాన్సుడ్ సిఎంసి మిషన్ టెక్నీషియన్ మరియు మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ పురుషులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మొత్తం 172 సీట్లు ఉన్నాయని, నియోజకవర్గం విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియాగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈనెల 28వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకునేవారికి వెబ్ సైట్ చిరునామా https:/iti.telangana.gov.in ను సందర్శించి రూ.100 రుసుము చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదం అంచుల్లో పొంచి ఉన్న ప్రయాణం



**ప్రజాపక్షం/రేగొండ:** రేగొండ మండల కేంద్రంలో ప్రయాణికుల ప్రయాణం ప్రమాదం అంచుల్లో పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్న సంఘటన చోటుచేసుకుంది. వివారల్లోకి వెళితే రేగొండ మండల కేంద్రంలోని ఎస్ఆర్ఎస్‌పిడిబిఎం 38 కెనాల్ కాలువ మీద నుండి వాహనాల లో వెళ్లే ప్రయాణికులు పరిస్థితి ఆందోళన కరంగా మారి భయందోళన గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల, మండలాల ప్రజలు, రేగొండ మండలం లోని సుమారు 10 గ్రామ పంచాయితీ ల ప్రజలు అదే విధంగా నిత్యం కొడవటంచ గ్రామం లోని పుణ్యక్షేత్రం అయినా శ్రీ లక్ష్మి నర్సింమస్వామి దేవస్థానంకు వెళ్లే భక్తులు అరచేతిలో ప్రాణాలు పెట్టు కొని ప్రయాణం చేస్తున్నారని ఏ టైమ్ లో ప్రయాణం చేస్తున్న వాహనం జారీ కెనాల్ కాలువ లో పడి పోతుందని ఒళ్ళు బిగీయ పట్టి ప్రయాణం చేస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే పరకాల భూపాలపల్లి ప్రధాన రహదారి కి ఆనుకోని ఉన్న చిట్యాల, □ట్యాల, లక్ష్మినరసింహ స్వామి పుణ్య క్షేత్రం కు వెళ్లే రహదారి కి లక్ష్మి నరసింహస్వామి ఆర్చి నిర్మాణం జరుగుతుంది. అందుకు గాను దారి మల్లించి కెనాల్ పైనుండి వెళ్ళేవిధంగా ప్లాన్ చేశారు. ఆర్చి నిర్మాణం చేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన పనులు నిమ్మకునీరేతినట్లు ఉన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నిత్యం కురుస్తున్న వర్షాలకు వాహనాలు కెనాల్ పై వెళుతున్న క్రమంలో అదుపు తప్పుతున్నాయి అని వాహనాల డ్రైవర్లు అతి జాగ్రత్త గా నడుపుతూ టెన్షన్ కు గురవుతున్నామిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబందింత అధికారులు చొరవ తీసుకొని ఆర్చి నిర్మాణ పనులను వేగవంతం చేయాలనీ కోరారు.

## యువ శాస్త్రవేత్త బుర్ర మణిదీప్ గౌడ్‌కు అంతర్జా తీయ గుర్తింపు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి కృష్ణ కాలనీకి చెందిన బుర్ర మణిదీప్ గౌడ్ తన పరిశోధనతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాడు. గోవా బిట్స్ పిలానీ క్యాంపస్ లో పీహెచ్.డీ చేస్తున్న ఆయన హోలిన్ ప్రోటీన్ పై చేసిన అధ్యయనం ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రీయ పత్రిక ఫబ్స్ లెటర్స్ లో కవర్ ఆర్టికల్ ప్రచురితమైంది. వైరలేస్ బాక్టీరియాలను ఎలా విచ్ఛిన్నం చేస్తాయో ఆయన లోతుగా అధ్యయనం చేశారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని భూపాలపల్లిలో స్థానికులు, గౌడ సంఘం నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతం నుంచి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందడం యువతకు ప్రేరణ అని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, సంఘం నాయకులు పెరుమాండ్ల తిరుపతి గౌడ్, పనుగంటి హారిక శ్రీనివాస్ గౌడ్, సదానందం గౌడ్, శ్రీపతి చంద్రమౌళి గౌడ్, ముత్యాల రాజబాబు గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, పంజాల శ్రీధర్ గౌడ్, గండి చిరంజీవి గౌడ్, పెరుమాండ్ల రేవంత్ గౌడ్, శ్రీపతి కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం చేసిన కాంగ్రేస్ నాయకులు

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన మడే రాజబాబు, గత పది రోజుల క్రితం కత్తి పోటుకు గురై మృతిచేందగా విషయం తెలుసుకున్న కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ అప్సర్ పాషా ఆధ్వర్యంలో బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50, కేజీల సన్న బియ్యం, 6 వేల రూపాయలు ఆర్థిక సహాయం అదించారు. మీకు మీ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటూరు గ్రామ కమిటీ అధ్యక్షులు దేగల బాణయ్య, మాజీ సర్పంచ్ సిద్దబోయిన సాగర్, ఎంపిటీసి చిట్యాల శైలేజా అరుణ్ కుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం నాగేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు గాయం రాజబాబు, మాచర్ల బాబు, పల్ల లచ్చబాబు, పల్ల శ్రీను, దేగల లక్ష్మయ్య, తల్లడి లక్ష్మయ్య, యూత్ నాయకులు గాయం రవీందర్, తోట వెంకటేష్, గడ్డం రవీందర్, గుట్ట బిక్షపతి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తుపాకులగూడెం బ్యారేజ్ పరిశీలించిన ములుగు : ఎస్పి

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** ములుగు జిల్లా కన్నాయిగూడెం, మండలంలోని బుధవారం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజ్ ను మరియు గోదావరి వరద ముంపు గ్రామమైన వెంకట్రావుపల్లి గ్రామంలో ములుగు ఎస్పీ డా॥ శబరీష్, సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, అధికారులతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, పోలీస్ అధికారులు, పలు శాఖల అధికారులు, ముంపు ప్రాంత ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, కన్నాయిగూడెం, ఎస్సై వెంకటేష్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షునిగా పాగె రంజిత్ కుమార్

**ప్రజాపక్షం/ కాటారం:** బిజేపీ మండల అధ్యక్షునిగా పాగె రంజిత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన ఐదు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి,మాజీఅధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి,చల్ల నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కాటారం మండల బిజేపీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడుపాగె రంజిత్ కుమార్,ఉపాధ్యక్షుడుతోడె వీరా రెడ్డి,గంట అంకయ్య,చీర్ల బాపు రెడ్డి,చీర్ల అశోక్ రెడ్డి,పర్తి రెడ్డి హన్మయ్య,ఇజమూరి సదానందం,ప్రధాన కార్యదర్శులుగా ఆత్మకూరి స్వామి యాదవ్,గోగుల రాజేష్,మంత్రి సునీల్,బొంతల రవిందర ముదిరాజ్,కార్యదర్శులుగా పెంట మధు,బండి రమేష్,బొడ్డు శివ,గండు మల్లా రెడ్డి,ముద్రకోళ్ల సుధాకర్,గాలి సారయ్యలను ప్రకటించారు.కోశాధికారిగా తోడె శ్రీనివారెడ్డి,కిసాన్ మోర్చాగండు తిరుపతి,ఎస్సి మోర్చావేముల లింగయ్య,చందుపట్ల సునీల్ రెడ్డిచల్ల నారాయణ రెడ్డి నియమించారు.ఈ కార్యక్రమంలో మహాముత్తారం,మహాదేవపూర్,మల్హార్,మండలాల అధ్యక్షులు,పూర్ణచందర్,మనోజ్,శ్రీకాంత్,దుర్గం తిరుపతి,బండం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధన పద్ధతిని మార్చుకోవాలి

జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/వరంగల్:** ఉపాధ్యాయులు బోధన పద్ధతిని మార్చుకొని విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ నగరంలోని సుందరయ్య నగర్ జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సుందరయ్య నగర్ జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల పఠన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులు సక్రమంగా చదవకపోవడంపై సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోధన పద్ధతులను మార్చుకోవాలని, అందుకుగాను ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆహార మెను, వంటగదిని పరిశీలించారు. రోజువారి మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల నుండి భోజనం నాణ్యత పై ఫీడ్‌బ్యాక్ తీసుకొని వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, అందరూ విద్యార్థులు యూనిఫామ్ ధరించి పాఠశాలకు వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అధికారులచే నిరంతరం ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఏదైనా లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న రెండు గదుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని డీఈఓను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యపరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి

ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్




**ప్రజాపక్షం/ వరంగల్ :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఎంసిపిఐ(యు) కాశిబుగ్గ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం ఎల్బీనగర్ లోని కమ్యూనిటీ హాల్‌లో పోలేపాక రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అండర్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నీరు నిలిచి చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోందని, దీంతో దోమలు, ఈగలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న పట్టించుకునే నాధుడే లేరన్నారు. కనీసం బ్లీచింగ్, ఫాగింగ్ సైతం చేయడం లేదన్నారు. తక్షణమే కనీస చర్యలు చేపట్టే విధంగా అధికార యంత్రాంగాన్ని పురమాయించాలని డిమాండ్ చేశారు. పేదల కాలనీలో తక్షణమే హెల్త్ క్యాంపులు పెట్టాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అర్హులైన పేదలకు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అధికార పార్టీ కార్యకర్తల జోక్యాన్ని నివారించాలని కోరారు. లేకపోతే అర్హుల అందరితో ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు.

## ఆదాయపు పన్ను చట్టాలపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ హంటర్ రోడ్డులోని ఐసిఏఐ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆదాయపు పన్ను చట్టాలపై అవగాహనా సదస్సులో ఆదాయపు పన్ను అధికారి రామ్‌నాధరెడ్డి మాట్లాడుతూ ఆదాయపు పన్ను మినహాయింపులకు సంబంధించి ఫారం 10ఎబీను సెప్టెంబర్ 30 లోపు దాఖలు చేయాలని ఆధాయాపు పన్ను శాఖ అధికారులు ఎం.రామనాథరెడ్డి, విజయ్ కుమార్ సాహు, జి.చక్రధరిలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆదాయపు పన్నుచట్టం ఫారం 10ఎబీ, సంబంధిత విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఆధాయపన్ను సంచాలకులు బి.బాలకృష్ణ, అదనపు సంచాలకులు పి.సుమిత ఆదేశాల మేరకు ఆధాయపన్ను చట్టాలు, నూతన సవరణలు, మినహాయింపులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదాయపు పన్ను మినహాయింపుల నమోదు పునరుద్ధరణ నిమిత్తం ఫారం 10 ఏబీని నిర్ణీత గడువు అనగా సెప్టెంబర్ నెల 30లోగా దాఖలు చేసుకోవాలని సూచించారు. సిఏ గోపీచంద్ మాట్లాడుతూ ఇప్పటికి అనేక నిబంధనలను సరళీకరించారని మరింత సులభతరము చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ రిటర్నులు దాఖలు మరింత ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ICAI వరంగల్ బ్రాంచి చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ, ఇలాంటి అవగాహనా సదస్సును, స్వయముగా కమీషనర్ పర్యవేక్షణలో నిర్వహించడము అనేక సమస్యలకు సులువైన పరిష్కారాలు చూపడము అభినంద నీయమని, గొప్ప విషయమని కొని యాడారు. ఈ కార్యక్రమములో బ్రాంచ్ సెక్రటరీ వినీల్, సిఏలు దేవ సహాయము ఓంప్రకాష్ లోయ, శిరీష్, జి.రవి కుమార్, అనేక మంది సిఏ లు టాక్స్ కంసల్టనట్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్య సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియూ)రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య




**ప్రజాపక్షం/ వరంగల్ :** ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియూ) రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్, ఫిట్నెస్ ప్రభుత్వమే భరిస్తూ ప్రమాద బీమా రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ 10లక్షలు, ఉచిత వైద్యం మొత్తం రవాణా రంగ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. 2019సవరణ చట్టం రాష్ట్రంలో అమలు చేయొద్దన్నారు. అధ్యక్షులుగా తోటం మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎండి బషీర్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా ఎండి ఇంతియాజ్, సహాయ కార్యదర్శి షేక్ యాకుబ్ పాషా, మంద ప్రభాకర్, ఎండి రంజాన్, అడ్డగట్ల మురళి, భట్టు కరుణాకర్, ఎండి చాంద్ పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి రాగుల రమేష్, సిఐటియు వరంగల్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, నాగూర్ల వెంకటేశ్వర్లు, హనుమకొండ శ్రీధర్, సాంబరాజు ప్రశాంత్, గున్నాల ప్రభాకర్, అప్పాజీ వాణి, మాదేశ్ల ఉపేందర్, యూసుఫ్, జూపాక రాజు, లింగన్న, బాబన్న, బి.రాజేష్, మహేష్, శివరాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రవీందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుగులోతు సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, చిర్ర మల్లయ్య, ఎండీ నయీం, ఎనగందుల మురళి, చెవ్వ కాశీనాథం, ఎండీ ఉస్మాన్, మందాటి సుదర్శన్‌రెడ్డి, కాంచనపల్లి వనజారాణి, పాల్వంచ కోటేశ్వర్, పీరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండ ఉర చెరువులో అక్రమసేద్యం చేస్తున్నారని రైతుల ఆరోపణతో తహసీల్దార్ వేముల రాజకుమార్ తన సిబ్బందితో వెళ్లి అక్కడ అక్రమంగా చెరువులో దున్నుతున్న ట్రాక్టర్ ను సిజ్ చేసి తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు.

## ఆదాయ యూనిట్లపై దృష్టి సారించండి

పట్టణ సమాఖ్య సమావేశంలో కమిషనర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** పట్టణ సమాఖ్యలు ఆదాయాన్ని పెంపొందించే యూనిట్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం నగర పరిధిలోని భీమారంలోని కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన రుద్రమ దేవి టిఎల్ఎఫ్ నెల వారి సమావేశానికి కమిషనర్ హాజరై సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. అనంతరం టిఎల్ఎఫ్ సభ్యురాళ్ళు కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎంసిలు రమేష్, వెంకట్ రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సకినాల రమేష్, సునీల్ తో పాటు రుద్రమదేవి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు రజిని, ఆర్‌పిలు ఓబిలు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నర్సంపేట పట్టణ అధ్యక్షులు బత్తినిరాజేందర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు బత్తిని రాజేందర్ మాట్లాడుతూ ఆధునిక భారత రూపశిల్పి, భారతయువశక్తికి ప్రేరణ, సాంకేతికతను గ్రామీణ భారతానికి చేర్చిన మార్గదర్శి, దేశ ఐక్యత కోసం తన ప్రాణాలు అర్పించిన నాయకుడు మాజీ ప్రధాని అన్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి చింతల సాంబ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడి, మాజీ సర్పంచ్ చిలువేరు రజిని భారతి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు గంధం నరేందర్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్స్ మాదాసి రవి, తదితరులు పాల్గొన్నారు.

## చెరువు హద్దులు రాళ్లు తొలగింపు





**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా చంద్ర గొండ ఊర చెరువులో గతంలో ఐబి అధికారులు చెరువుకు హద్దులు నిర్ణయించి హద్దు రాళ్ళు పాతారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం హద్దురాళ్ళను తొలగించి అక్రమసేద్యం చేస్తున్నారనే సమాచారంతో సంబంధిత అధికారుల ఆదేశాలతో సిబ్బంది వెళ్లిసిబ్బంది రాళ్లు తొలగించి ఉన్నాయి. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు సంబంధిత అధికారులకు సమాచారం ఐబి అధికారులు ఇచ్చినారు.

## బోనాలు నిర్వహించిన కార్పొరేటర్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** శ్రీ పోచమ్మ బోనాలు చివరివారం కావడంతో 27వ డివిజన్లోని ముదిరాజులు అంగరంగ వైభవంగా జరిపారు ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గుట్ట కింది ప్రాంతంలోని ముదిరాజు వీధి, గుండ్లోల్ల వీధి, బండి వారి వీధి, చింతాకుల వాడ,నుండి ముదిరాజు కుల పెద్దలు చింతాకుల సునీల్, పద్మ, శ్రీనివాస్, గోపి, సిరబోయిన మహేష్, నర్ర రాజేష్, చెమల సాగర్, వెంకట్, రాజేందర్, నగేష్ల సారథ్యంలో మహిళలు బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళామణులు ధనలక్ష్మి, వాణి, స్వాతి, అరుణ, సునీత, మంజుల, కల్పన, లత, జ్యోతి, శైలజ, మౌనిక, కలమ్మ, శ్రీదేవి, సుజాత ,సరిత, విజయ, స్రవంతి, శోభా, రజిత, తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ స్కూల్లో మాక్ పోలింగ్

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ప్రభుత్వ మోడల్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. హెడ్‌బాయ్‌గా గణేష్, హెడ్ గర్ల్‌గా శివాని, డిప్యూటీ హెడ్ బాయ్‌గా రామ్‌చరణ్, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా కోమలత ఎన్నికలలో గెలుపొందడం జరిగింది. వీరిని ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇలాంటి మాక్ పోలింగ్‌తో పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. పిల్లలు ఇదే స్ఫూర్తితో తమలోని నాయకత్వ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్‌టియు మహాధర్నా విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/గూడూరు :** టీఎస్ పిఆర్‌టియు నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలిని పిఆర్టియు మండల అధ్యక్షులు కార్యదర్శి సోనబోయిన రవిచంద్ర మండల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గూడూరు మడంల కేంద్రంలో పిఆర్‌టియు నిర్వహిస్తున్న మహాధర్నా గోడ పత్రికలను మమబూబాబాద్ జిల్లా టిజీఓ అధ్యక్షులు ఎండి రఫి పిఆర్‌టియు నాయకలు ఆవిష్కరించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నేల సెప్టెంబర్ 1 న పెన్షన్ విద్రోహక దినాన్ని పురస్కరించుకోని ఏర్పాటు చేసీన మహాధర్నాను విజయవంతం చేయాలని కొరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ ఓపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకలు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుద్ధ్యం



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జఫర్‌గడ్ గ్రామంలోని అనుబంధ గ్రామం వడ్డేగూడెం, జఫర్గడ్‌లో మురికి కాలువలు ఎక్కడ పడితే అక్కడే ఉన్నాయని పారిశుద్ధ్యం పడకేసిందని సిపిఎం జిల్లా కర్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కాట సుధాకర్ అన్నారు. సీపీఎం టౌన్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో పేరుకుపోయిన అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్యంపై రెండవ రోజు సర్వే పరిశీలనను వడ్డేగూడెంలోని 8,9,10,11,12,14వ వార్డులలో సర్వే చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కాలువల నిర్మాణం లేకపోవడంతో నీరు నిలిచిపోయి దోమలు, ఈగలు వాలి ప్రజలకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వెంటనే కాల్వలను నిర్మించి రోడ్లపై నీరు నిలవకుండా చూస్తూ పారిశుధ్యాన్ని క్లియర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నల్లతీగల శ్రీను, పట్టణ కార్యదర్శి నరసింహా, వడ్డేగూడెం కార్యదర్శి రేణుక, చిరంజీవి, సుధాకర్, అప్సర్, అలీమ్, వెంకటేష్, బాబు, సమ్మయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గోదావరి ఉగ్ర రూపం

### డేంజర్ లెవల్ చేరువలో నీటి మట్టం
### వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
### లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లోఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద బుధవారం గోదావరి ఉగ్ర రూపం దాల్చి పరవళ్ళు తొక్కుతోంది. ఎగువన గోదావరి బేసిన్ ప్రాంతాల వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం గేట్లు ఎత్తి భారీ స్థాయిలో వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో పాటు మహారాష్ట్ర ప్రాంతాల నుండి ప్రవహిస్తున్న ప్రాణహిత వరద ఉధృతి పోటెత్తి కాళేశ్వరం పుష్కర ఘాట్ తీరం వద్ద గోదావరిలో చేరుతుండటంతో గోదావరి ఉగ్ర రూపం దాల్చి ఉరకలేస్తోంది.కాళేశ్వరం తీరం వద్ద గోదావరి వరద ఉధృతి అంతకంతకు పెరిగి 12.210 మీటర్ల నీటిమట్టం వద్ద జారీ చేసే మొదటి ప్రమాద హెచ్చరికను దాటి బుధవారం సాయంత్రానికల్లా 12.830 మీటర్ల నీటిమట్టం ఎత్తుకు చేరుకొని డేంజర్ లెవల్ చేరువలో గోదావరి ఉధృతి కొనసాగుతోంది. వరద నీరు 13.460 మీటర్ల నీటిమట్టానికి చేరితే డేంజర్ లెవల్ ప్రకటన జారీ కానుంది.గోదావరి, ప్రాణహిత ఉభయ నదుల వరద ఉధృతి పోటెత్తి 10.43లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది.. పుష్కర ఘాట్ వద్ద స్నాన ఘట్టాలను వరద నీరు పూర్తిగా ముంచెత్తగా, సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద జ్ఞాన దీపాలను ముంచెత్తి గోదావరి జలకళను సంతరించుకుని నిండుకుండలా మారి ఉధృతంగా ఉరకలేస్తుంది. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో తీరం వద్ద పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు లోతు ప్రమాదాలకు గురి కాకుండా స్థానిక ఎస్ఐ తమాషా రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. తీరం వద్ద ఏర్పాటు చేసుకున్న చిరుదుకాణాలను ఖాళీ చేయించి గ్రామంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. గోదావరి వరద ఉధృతి గంటగంటకు భారీగా పెరుగుతుండటంతో గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి వరద పోటెత్తడంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పూస్కుపల్లి, బలిజాపూర్, చంద్రుపల్లి,అన్నారం తదితర లోతట్టు ప్రాంతాల పంట భూములను వరద నీరు ముంచెత్తింది.

## తెలియకుండా మాట్లాడడం భావ్యం కాదు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** తెలియకుండా అవగాహన లేమితో మాట్లాడడం భావ్యం కాదని ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘం చైర్మెన్ చల్ల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వామన్ రావు, కట్కం అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కరెంట్ షాక్‌కు గుర్రై మరణిస్తే ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారని బిఆర్‌ఎస్ నాయకులు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతి చెందితే ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన దాఖలాలు లేవని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గోదావరిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు లక్ష రూపాయల ఎక్స్‌గేషియా ప్రకటించి అందించారన్నారు. గత పది సంవత్సరాల కాలంలో గోదావరిలో మునిగి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎంత మందికి బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మీ నాయకుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అందించారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలోని రైతులు కరెంట్ షాక్‌తో మరణిస్తే రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటసమ్మయ్య, కడార్ల నాగరాజు. కలికోట ధనంజయ్, వెకటరమణ తదితులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు





**ప్రజాపక్షం/తొర్రూరు:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను తొర్రూరులో ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ అమలు చేసిన పథకాలు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, గంజి విజయపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కందాడి అచ్చిరెడ్డి, వెంకటాచారి, యూత్ పట్టణ అధ్యక్షుడు బసనబోయిన మహేశ్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, కుశాల్, సురేశ్, మనోహర్, జలీల్, మహేశ్వరి, కల్పన, అనిల్, వెంకన్న, యశోద, దుర్గేశ్, రమేశ్‌నాయక్, మధు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఖానాపూర్‌లో..** ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ వీరమనేని సాగర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె లాల్ సాహెబ్, మండల ఉపాధ్యక్షుడు ఇరుకు ప్రభాకర్ రావు, కార్యదర్శి కోరే రాములు, తదితరులు పాల్గొన్నారు.

**గూడూరులో..** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కోమ్మాలునాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికీ పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఐటి సెక్టర్ను నెలకోల్పి దేశానికీ కోత్త తరాన్ని అందించిన ఘనత రాజీవ్ గాంధీకే చెందుతుందని కోనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల నాయకలు శ్రీపాల్‌రెడ్డి ఎడ్ల నరేష్‌రెడ్డి బోల్లికోండ మధు చంటి స్వామి యాకయ్య శ్రీనువాస్ సునిల్ వల్లెపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్చిగేటు నిర్మాణంపై కలెక్టర్ అసహనం

**ప్రజాపక్షం/కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఆర్చి గేట్ నిర్మాణంలో అలసత్వం ప్రదర్శించిన దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులపై కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో బుధవారం గోదావరి వరద ఉధృతి పరిశీలనకు వచ్చిన కలెక్టర్ గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి గేట్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆర్చిగేటు నిర్మాణంలో ఎందుకు జాప్యం జరుగుతుందని సరస్వతి పుష్కరాల సమయం నుండి ఇదే పరిస్థితి కొనసాగుతుంటే ఇప్పటి వరకు ఎందుకు పూర్తి చేయలేకపోయారని దేవాదాయ శాఖ ఏఈ అశోక్ పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయకుండా ఇప్పుడు వర్షాలు పడుతున్నాయని ఏవో కారణాలు చెప్పడం సరికాదని కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యం దృష్ట్యా నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి, అవసరమైన మరమ్మత్తులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మృతుని అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రేగొండ :** అనారోగ్యంతో మృతి చెందిన బొచ్చు రామచంద్రు అంత్యక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్నం రవి, మోరే నరేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, మండలంలోని రంగయ్య పల్లి గ్రామానికి చెందిన బొచ్చు రామ చెంద్రు కాంగ్రెస్ పార్టీ లో సీనియర్ నాయకులు గా ఉండి అటు పార్టీ కి ఇటు గ్రామం లో దళితుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమం వారి కుమారులు బొచ్చు మొగలి బొచ్చుసదయ్యలు, నాయకులు బల్గురి ప్రభాకర్ పాడె మోసి సంతపం తెలిపారు.

## పోగొట్టుకున్న బంగారం అప్పగింత : సిఐ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పోగొట్టుకున్న బంగారం బాధితురాలికి సిసి కెమెరాల ద్వారా వెతికి అప్పగించినట్లు భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. వీరాల్లోకి వెళితే భూపాలపల్లి మండలం దీక్షకుంటకు చెందిన పక్కల రాజమ్మ అనే మహిళ పని నిమిత్తం భూపాలపల్లి బ్యాంకుకు పని పై భూపాలపల్లికి వస్తున్న క్రమంలో అంబేద్కర్ సెంటర్ వద్ద ఆటో దిగుతున్న క్రమంలో పర్సులో నుంచి చైను, చెవి కమ్మలు జారీ కింద కింద పడిపోయాయి. తీరా బ్యాంకుకు వెళ్లి పర్సు చూసుకుంటే అందులో నుండి బంగారం జారి పడిపోవడంతో ఆ మహిళ ఆందోళనకు గుర్రై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. వెంటనే పోలీసులు సీసీ కెమెరాల ద్వారా బంగారం దొరకబట్టి బాదితురాలకి అప్పగించడం జరిగిందని సిఐ తెలిపారు. ఈ బంగారాన్ని వెతకడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడ్డాయని ప్రతి ఒక్కరు విధిగా తమ షాపుల వద్ద లేదా కమ్యూనిటీగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మచ్చ సాంబమూర్తి, బాధితురాలు బంధువులు పాల్గొన్నారు.



### అలుగు పారుతున్న మల్కా చెరువు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గత రెండు రోజుల నుండి నిజాంపేట మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు నిజాంపేట మల్కచెరువు మత్తెడి దూకడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. చల్మెడ, నందిగామ, గ్రామాల చెరువులు మత్తెడ దూకడంతో దిగువన ఉన్న నీరు మల్క చెరువులోకి చేరడం తో నిండు కుండలా మారి మత్తెడ దూకడం జరుగుతుం దన్నారు. మత్తెడను చూసేందుకు చుట్టుముట్టు గ్రామాల ప్రజలు వచ్చి సెల్ ఫోన్ లలో సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.

## పండుగ భక్తిని చాటాలి

### ఎస్సై శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పండుగలు భక్తిని చాటాలి.. కాని విషాదాలు కావద్దని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు వినాయక చవితి ఊరేగింపులు, శోభాయాత్రలు తగిన జాగ్రత్తలతో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలు సాధ్యమైనంత చిన్నవిగా ఉండాలన్నారు. పరిమితికి మించి పెద్ద విగ్రహాలు తెచ్చేటపుడు, నిమజ్జన సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. మంటపాల డెకరేషన్, సౌండ్ బాక్సు ఏర్పాట్లలో విద్యుత్తుతో జాగ్రత్తగా ఉండాలన్నారు. మంటపాల ఏర్పాటుకు తప్పని సరిగా ఆన్లైన్ అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల వరకు లౌడ్ స్పీకర్లు బంద్ చేయాలని సూచించారు. నిమజ్జనం సమయంలో మత్తు పదార్థాలు సేవించవద్దని, చెరువులు, కుంటల్లో లోతుకు వెళ్ళొద్దని సూచించారు.

## 'స్థానికం'పై ఆశావహుల ఎదురుచూపులు

**ప్రజాపక్షం/కొండాపూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలపై ఎదురుచూపుల పర్వం కొనసాగుతుంది. ప్రభుత్వం ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తుందో తెలియని ఆయోమయ పరిస్థితిలో ఆశావాహులు ఉన్నారు. రేసులో నిలబడే వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్తున్న నేపథ్యంలో ఈయొక్క ప్రక్రియ సాధ్యమ అవుతుందా? లేక పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా . అనే అంశం సర్వత్రా చర్చాంశనీయంగా మారింది. సంగారెడ్డి జిల్లాలో 26 మండలాల్లో 271 ఎంపిటీసీ స్థానాలు 26 జడ్పిటీసీ స్థానాలు 631 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా 2024 ఫిబ్రవరి లో సర్పంచుల వార్డు సభ్య పదవీకాలం ముగిసింది. 2024 మేలో ఎంపిటీసీ జెడ్పీటీసీ జిల్లా పరిషత్ చైర్మెన్ల పదవీకాలం ముగిసింది. ప్రజాప్రతినిధులు లేక గ్రామాల్లో అభివృద్ధిపనులు కుంటు పడుతున్నాయి. గ్రామాల్లో సర్పంచులు లేక పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. కాగా సెప్టెంబర్ 30 తేదీలోపు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి హై కోర్టు సూచనలు పంపింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సాంకేతాలువస్తున్నా ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు.

# మతసామరస్యాలకు ప్రతీక గణేష్ ఉత్సవాలు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/మెదక్:** మెదక్ జిల్లాలో మతసామరస్యాలకు ప్రతీకగా గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పర్యావరణహింత కోసం మట్టి గణపతులను వాడాలని, గణేష్ మండపాల వద్ద డిజె సౌండ్ నిషేధించడటం జరిగిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డిఆర్ఓ భుజంగరావు, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి డీఎస్పీలు సంబంధిత జిల్లా అధికారులు తాసిల్దార్లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ శాఖల అధికారులు గణేశు ఉత్సవాలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు, గతంలో ఏర్పడిన సమస్యలు, ఇంకా మెరుగైన ఏర్పాట్లపై స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు తాసిల్దారులు,ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పేదింటి ఆడబిడ్డకు పుస్తెమట్టెల పంపిణీ

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన అంక్షాపూర్ యాదగిరిగౌడ్ కూతురు పెళ్లికి అదే గ్రామానికి చెందిన జెపి యాదవ్,జంపల్లి పరుశరాములు పుస్తెమట్టెలు పంపిణీ చేశారు. జెపి యాదవ్,జంపల్లి పరుశరాములు కలిసి నేటితో 50 మంది పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డపెళ్లిళ్లకు పుస్తెమట్టెలు చేశారు. ఈ సందర్భంగా జెపి యాదవ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డలకు పుస్తెమట్టెలు పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తానని అన్నారు. అనంతరం జెపి యాదవ్‌ను మిట్టపల్లి పిఏసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు పంపిణీ చేయాలని ఆలోచన రావడం అభినందించదగిన విషయమన్నారు.ఈ కార్యక్రమంలో యువకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### మెదక్ జిల్లా ఎల్లో అలర్ట్ లో ఉంది
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** జిల్లాలో భారీ వరద ప్రవాహ ఉధృతి వలన నష్టం వాటిల్లిన వాటిపై తాత్కాలిక మరమ్మతుల దిశగా జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ అల్లాదుర్గ్ మండలంలో పర్యటించి మండల కేంద్రంలోని బట్టికుంట తెగిపోయిన కట్టను పరిశీలించి అనంతరం చిల్వర్ గ్రామంలోని చెరువు కట్టను ఎమ్మార్వో ఇరిగేషన్ అధికారులతో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసాయని ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరిగింది అన్నారు. వర్షాలు వరద నీటితో లోతట్టు నీరు చేరిందని, అల్లాదుర్గ్ మండలంలో వర్షపాత నమోదు వివరాలు, వరద ప్రవాహ ఉధృతికి కోతకు గురైన రోడ్లు, చిలువూర్ చెరువు కట్టకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇంకా ఆరంజ్ అలర్ట్ లో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ తెలిపారు. చెరువులు నిండి అలుగు పారి ఇండ్లల్లో ప్రవేశించే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్డు కోతకు గురైన దగ్గర,ఇసుక బస్తాలు సిద్ధం చేసుకుని అవసరమైన దగ్గర ఉపయోగించుకొని పునరుద్ధరించాలని ఆదేశించారు. లో లైన్ కాజ్‌వేలు పూర్తిగా నీరు తగ్గే వరకు ప్రజలను ప్రయాణాలు చేయకుండా భారీ కేడింగ్ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య ఎంపీడీవో చంద్రశేఖర్ ఇరిగేషన్ ఏఈ స్రవంతి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శుభం శ్రీ మార్ట్ షాపింగ్ మాల్ ప్రారంభం





### హాజరైన వివిధ పార్టీల నాయకులు
### ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణంలో నీ మెదక్ వెళ్లే మార్గంలో నూతనంగా బుధవారం శుభం శ్రీ మార్ట్ షాపింగ్ మాల్ ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి వివిధ పార్టీల నాయకులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసి రెడ్డి, ,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ లు వేరువేరుగా హాజరై నూతన శుభం శ్రీ మార్ట్ షాపింగ్ మాల్ లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అతిథులకు నిర్వాకులు శాలువాలతో సన్మానం చేశారు . ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్ మాజీ జడ్పిటిసి శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షులు మల్లేశం, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నాయకులు నాగేష్, మహేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఎరుకల యాదగిరి, నిర్వాహకులు రంగయ్య సేటు, వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాల తనిఖీ

**ప్రజాపక్షం/గజ్వేల్ :** కలెక్టర్ ఆదేశాల మేరకు గజ్వేల్, ప్రజ్ఞాపూర్ లలోని ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలను జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, ఏడిఏ బాబు నాయక్ లు బుధవారం తనిఖీలు నిర్వహించారు. గజ్వేల్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, వసతిగృహం, పాలిటెక్నిక్ కళాశాల, వసతి గృహం తదితర పరిశీలించి మెనూ ప్రకారం భోజనం, ఇతర ఆహార పదార్థాలు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న భోజనము, ఇతర వంటకాలను వారు రుచి చూశారు. ముఖ్యంగా పోషక విలువలతో కూడిన నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గురుకులాలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకోగా, పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు స్పష్టం చేశారు.

## ముదిరాజులను పట్టించుకోని ప్రభుత్వం

### జిల్లా మత్స్యశాఖ సొసైటీ డైరెక్టర్ గాండ్ల కృష్ణ ముదిరాజ్

**ప్రజాపక్షం/కొడిపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజులు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చేప పిల్లల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తుందని మెదక్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గాండ్ల కృష్ణ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అధిక శాతం ఉన్న ముదిరాజులకే మొండి చేయి చూపిస్తే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. గత ప్రభుత్వం పాలనలో ముదిరాజుల అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి పథకాలతో పాటు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. దీనికి తో పాటు ముదిరాజుల ఎదుగుదలకు చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పంపిణీ చేసి ఆదుకుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ ఊసే లేదని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఉపాధి కోసం టూ వీలర్స్ వెహికల్, ఫోర్ వీలర్ ఫ్రీగా ఇవ్వడంతో పాటు ఉపాధి పొందడానికి సబ్సిడీ లోన్లు అందజేసింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనికరించి ముదిరాజులకు ప్రభుత్వ పథకాలు తోపాటు చేప పిల్లల పంపిణీ చేయాలని కోరారు.



## రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/టేక్మాల్ :** మండల కేంద్రంలో బుధవారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారి 79 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అయన చేసిన సేవలు ఈరోజు గుర్తు చేసుకోవడం జరిగింది. రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆధునీకరణ, ఉదారీకరణలపై దృష్టి సారించింది. కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాలలో అతను అనేక ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజీవ్ గాంధీని భారతదేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవం ఘనత అతనికే చెందుతుంది. అతను విదేశీ విధానంలో చురుకైన పాత్ర పోషించాడు. శ్రీలంక, సోవియట్ యూనియన్ తో సంబంధాలను మెరుగుపరచడానికి కృషి చేశాడు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళలకు 33 రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారు. రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారు అని మండల నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్, మాజీ సర్పంచ్ పాపయ్య, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ భక్తుల కిషోర్, యన్ఎస్‌యూఐ కార్యదర్శి మహేష్ రెడ్డి, మండల నాయకులు తలారి అవినాష్, సాగర్ కాంతం అత్కూరి ధనంజయ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



### అనుమతి లేకుండా హరితహారం చెట్లు తొలగింపు

ప్రజాపక్షం/రేగోడ్ : మండల కేంద్రంలో రోడ్డు పక్కన హరితహారం చెట్లను తొలగించేశారు ఓ పక్క హరితహారం చెట్లు నాటుతుంటే మరోవైపు ఎలాంటి అనుమతి లేకుండా తొలగించినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి చెట్లను తొలగించొద్దని సామాన్య ప్రజలకు అధికారులు ఆదేశాలిస్తున్న ప్పటికీ రోడ్డుకిరు వైపులా ఆరు నుంచి ఏడు మీటర్ల పెరిగిన చెట్లను తొలగించిన ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు ఉన్నాయి. గ్రామపంచాయతీ కార్యదర్శి ఫోన్ చేయగా అందుబాటులో లేరు



### మల్లన్న దేవాలయంలో చోరీ

ప్రజాపక్షం/రామాయంపేట : రామాయంపేట పట్టణంలోని మల్లన్న దేవాయలంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయ ద్వారం తాళాలు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి గుడి తాళాలు పగులగొట్టిన విషయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాల్‌రాజ్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. హుండీలో సుమారు 10వేల వరకు నగదు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యాదవ సంఘం తెలిపారు. చోరీ ఘటన సీసీ ఫుటేజీల్లో రికార్డయింది.

### జనగామ నియోజకవర్గ ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష -జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/చేర్యాలః చేర్యాల మండలంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత రెండు నెలలుగా ప్రమాదవశాత్తు కాలు విరగడంతో రెస్టు తీసుకొని ఈ రోజు చేర్యాలలో గుజ్జుకుంట కమాన్ వద్ద కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ఎదుర్కోవడంతో పాటు చేర్యాలలో భారీ ర్యాలీ నిర్వహించారు. చేర్యాలలోని రేణుక గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాట్లాడుతూ జూన్ 11న కేసీఆర్ ఫామ్ హౌస్‌లో బాత్రూంలో జారిపడటంతో మేజర్ కాలు విరగడంతో డాక్టర్ల సూచన మేరకు రెండు నెలలు రెస్ట్ తీసుకొని ఈ రోజు జనగామ నియోజకవర్గం చేర్యాల కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట, మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నడం నాకు మీ దీవెనలె నాకు శ్రీ రామరక్ష అని అన్నారు.గత పది సంవత్సరాలలో కేసీఆర్ పాలనలో చెరువులు నింపామని రైతులకు సరిపడా నీరు కరెంటు ఎరువులు ఇచ్చామన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి, జనగామ మున్సిపల్ వైస్ చైర్మన్ జమున, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ స్వరూప రాణి, శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కర్ణాకర్ కృష్ణారెడ్డి, తలారి కీర్తన, కిషన్, బాల నర్సయ్య, మేక సంతోష్, ప్రేమలత పాల్గొన్నారు.

## వినాయక ప్రతిమల ప్రతిష్ఠాపనకు
# పోలీసుల అనుమతి తప్పనిసరి

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రజాపక్షం/ సంగారెడ్డి : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఈద్ మిలాద్ ఉన్ నబి పండుగలను పురస్కరించుకొని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా మండల కేంద్రాలతో వివిధ మతాలకు చెందిన పెద్దలతో పీస్ కమిటీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. వినాయక ప్రతిమను ప్రతిష్ఠించదలచినవారు ముందస్తుగా జిల్లా పోలీసులకు ఆనైన్ లింక్ ద్వారా సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఎస్‌హెచ్ఓలు ప్రతి మండపాన్ని ప్రత్యేక్షంగా సందర్శించాలని, అక్కడ మండపాల వద్ద భద్రత పరమైన ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. వినాయక ప్రతిష్ఠాపనకై ఏర్పాటు చేసే మండప నిర్మాణం రోడ్లపై చేపట్టకుండా జనజీవనానికి ఇబ్బంది లేకుండా ఉండాలన్నారు. వినాయక ప్రతిష్ఠాపనకై ఏర్పాటు చేసే మండలం వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల లోనూ పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్ స్పీకర్లు డిజెలకు అనుమతించకూడదన్నారు. ఎవరైన డిజె ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులపై డిజె యాజమానులపై చట్ట రీత్య చర్యలు తీసుకుంటమని నిర్వాహకులు సూచించాలన్నారు. మండప ఏర్పాట్లకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా పోలీసు అనుమతి తీసుకునేలా చూడాలని మండపాల వద్ద మైకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటతల వరకు మాత్రమే వినియోగించేలా చూడాలన్నారు.

## బిజెపి ప్రభుత్వ కుట్రలను యువత బహిర్గతం చేయాలి

### రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆంక్షా రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్ : ప్రపంచ దేశాల్లో భారత్ ను తలెత్తుకునేలా చేసిన దివంగత రాజీవ్, ఇందిరా గాంధీల చరిత్రను కేంద్రం లోని బిజెపి సర్కార్ కనుమరుగు చేసే కుట్ర చేస్తున్నట్లు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆంక్షా రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ విమర్శించారు. బుధవారం గజ్వేల్ లో నిర్వహించిన దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ తో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నేరుగా రోజ్‌గార్ నిధులు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 32 శాతం రిజర్వేషన్, 21 ఏళ్లకే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం తదితర సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆయన అందించిన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకున్న యువత నేడు ప్రపంచ దేశాల్లో సత్తా చాటుతున్నట్లు తెలిపారు. ఐటీ మరియు సాంకేతిక రంగాలకు పెద్దపీట వేసిన దివంగత రాజీవ్ గాంధీ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కర్ణాకర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, యాదగిరి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, నేతలు నక్క రేగొండ గౌడ్, అజ్గర్, గాడిపల్లి శ్రీను, కొండల్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్, గణేష్, లక్ష్మణ్, శివాలు, సురేష్, నరేష్ గౌడ్, సమీర్, ఆఫ్రోజ్, హస్సన్ పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు

### అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్



ప్రజాపక్షం/సిద్దిపేట : విద్యార్థులకు మెనుప్రకారం నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వంటగది, స్టోర్ రూంను పరిశీలించారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం భోజనం, స్నాక్స్ అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యమైన సరుకులు మాత్రమే వంటచేసేందుకు వినియోగించాలన్నారు. అలాగే వర్షాకాలం జాగ్రత్తగా ఉండి వేడివేడి ఆహారం అందించాలన్నారు. ఆనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం మీకు నాణ్యమైన విద్య,భోజనవసతి కల్పించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పుల్లురు గ్రామ పిహెచ్‌సి సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ప్రజలకు మేరుగైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. వర్షాకాలం మరింత అప్రమత్తంగా ఉండి పేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. మరింత ప్రమాదకరంగా ఉంటే జిల్లా ఆసుపత్రికి తరలించాలన్నారు.

## యూరియా కొరకు రైతులు ఆందోళన చెందరాదు

### కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/టేక్మాల్ : జిల్లా లో ఎక్కడ యూరియా కొరత లేకుండా అధికారులు ప్రతీ రోజూ క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం ధ్వారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. విక్రయ దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కేవలం యూరియానే కాకుండా నత్రజని ఆధారిత కాంప్లెక్స్ ఎరువులను, నానో యూరియాను కూడా వాడవలసిందిగా సూచించారు. ఎరువుల గురించి ఆందోళన చెందరాదని సమృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలియజేశారు కొద్దిమంది కావాలని వదంతులు సృష్టించడం ద్వారా రైతులు సెప్టెంబర్లో కొనవలసిన యూరియా కూడా ఇప్పుడే కొనడానికి షాపుల దగ్గర రావడంతో రద్దీ పెరుగుతుందని అలానే వదంతులు నమ్మవద్దని వచ్చే పది రోజుల్లో ఇంకా 1500 మెట్రిక్ టన్నుల యూరియా మన జిల్లాకు రావడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ లో కూడా మన అవసరానికి తగ్గట్టు 4000 మెట్రిక్ టన్నుల యూరియా వ్యవసాయ శాఖ నుండి మన జిల్లాకు తప్పకుండా పంపడం జరుగుతుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారని కలెక్టర్ చెప్పారు.



## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మణీయం

### టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

ప్రజాపక్షం/సంగారెడ్డి : భారత రత్న ,మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిర్మస్మరణీయని టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. బుదవారం సంగారెడ్డిలోని రాజీవ్ గాంధీ పార్కులో గల ఆయన కాంష్య విగ్రహానికి పూలమాలలు వేసి 81 జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ 40ఏళ్ల వయస్సులోనే ప్రధాన మంత్రి పదవిచేపట్టి కంప్యూటర్ రంగాన్ని దేశానికి పరిచయం చేసి టెక్నాలజీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి వాణిజ్య ,రక్షణ, విమాన యాన రంగాల్లో సంస్కరణలు ప్రవేశపట్టారన్నారు. యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన వ్యక్తి రాజీవ్ గాంధీయేనన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంత్‌కిషన్, ఆత్మకమిటీ చైర్మేన్ వై.ప్రభు, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, నాగరాజు రఘుగౌడ్, జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

**రాంచంద్ర పురంలో..**

రామచంద్రపురంలో ఘనంగా మాజీ ప్రదాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్, వారిని వాసంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన స్మృతిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

**పటాన్‌చెరు (చిట్కుల్లో ) :**

భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులుపెట్టించిన మహానీయుడు సాంకేతిక విప్లవానికి ఆద్యుడు దేశం కోసం ప్రాణాలు విడిచిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని నీలం ముదిరాజ్ అన్నారు. బుదవారం పటాన్‌చెరు లోని చిట్కుల్‌లో ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

### రంగనాయక్‌సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా రంగనాయక్ సాగర్ ప్రాజెక్టును మాజీ మంత్రి హరీష్‌రావు బుధవారం సందర్శించారు. పారుతున్న జలాలను చూసి హరీష్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని గోబెల్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ పారుతున్న జలాలు కాళేశ్వరం ప్రాజెక్టువి కావా ? రంగనాయక్ సాగర్ కాళేశ్వరం అంతర్భాగం కాదా అన్నారు. ఇక్కడే నడిచే పంపులు కాళేశ్వరంలో భాగం కాదా అని చెప్పాలన్నారు. ఎక్కడో ఒక పిల్లర్ కూలితే రేవంత్‌రెడ్డి మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు,19సబ్‌స్టేషన్లు, 21 సంప్ హౌజ్‌లు, 203 కిమీ సోరంగాలు,1531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్, 98 కిమీ.ప్రెజర్ మెయిన్స్ ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుల సాక్షిగా మాట్లాడుకుందాం..ఎవరు వస్తారో చెప్పాలన్నారు. పిసిసి అధ్యక్షుడుమహేష్ కుమార్ వస్తాడా? రేవంత్‌రెడ్డి వస్తారా? రండి ఈ ప్రాజెక్టు కట్టపై కూర్చోని మాట్లాడుకుందాం రండి అన్నారు. కూలింది అని ప్రజల్ని మోసం చేస్తున్నారని కాని ఇక్కడి ప్రాంతంలో రేవంత్‌రెడ్డిని ఎవరు నమ్మటం లేదన్నారు. తుగ్లక్ మాటలు మంచివి కావని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఇంకా 213 టిఎంసీల నీరు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎల్లంపల్లి వద్ద 5లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా పోతుందని, మోటర్లు ఆన్‌చేస్తే ఇక్కడి ప్రాజెక్టులు నిండి యాసంగి పంటకు అవసరమవుతాయన్నారు. సముద్రంలోకి నీరు వృధాగా వదిలి రైతుల నోటి కొడుతున్నారని విమర్శించారు. వరద నీటి వడిసి పట్టక బురద రాజకీయం చేస్తుందు రేవంత్‌రెడ్డి అని దుయ్యపట్టారు. రాజకీయాలు మాని రోజుకో ఒక టిఎంసీ నీరు తెచ్చి రిజర్వాయర్ నింపాలన్నారు. హైదరాబాద్ మూసికి గోదావరి జలాలు ఇస్తావని అంటున్నావు ? మూసికి నీరు ఎక్కడి నుండి తీసుకెళ్తావ్ అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పటికైన రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మాని, అన్ని మోటర్లు ఆన్ చేయాలని హితవు పలికారు.